


# ఎములాడ రాజన్నా.. రేవంత్ రెడ్డి మనసు మార్చు

- పంచాయతీల పెండింగ్ బిల్లులు ఇప్పించేలా చూడు
- స్వామివారికి రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ సర్పంచుల మొక్కు
- శివుడి విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన



వేములవాడ రాజన్న సన్నిధిలో కోడె మొక్కును చెల్లించుకుంటున్న మాజీ సర్పంచులు

వేములవాడ, నవంబర్ 18: గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు మార్చాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ సర్పంచుల సంఘం నాయకులు ఎములాడ రాజన్నను వేడుకున్నారు. సోమవారం ఆలయంలో కోడె మొక్కును చెల్లించుకొని శివుని విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు అక్కనపెల్లి కరుణాకర్ మాట్లాడుతూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్పంచుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని మాట్లాడిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని, పదకొండు నెలలుగా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. సర్పంచులపై కక్ష సాధింపు సాధించకుండా తక్షణమే రూ.1500 కోట్ల బకాయిలను విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

# వేములవాడ అభివృద్ధికి నిధుల మంజూరు

- రూ.127 కోట్ల నిధుల మంజూరుకు అనుమతినిస్తూ జీవోల జారీ

వేములవాడ, నవంబర్ 18: వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతులపై ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం జీవోలను జారీ చేశారు. పురపాలక సంఘం ద్వారా వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.76కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతుల జీవోను పురపాలక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిషోర్ జారీ చేశారు. ఇందులో రూ.50 కోట్లు 2024-25 ఆర్థిక సంవత్సరం, రూ.26 కోట్లు 2025-26 ఆర్థిక సంవత్సరంలో వీటీడీఏకు చెల్లించే విధంగా రాజన్న ఆలయ అభివృద్ధి కోసం నిధులను జారీ చేస్తూ జీవోను వెలువరించారు. మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు రహదారి విస్తరణ నిమిత్తం కూడా రూ.47 కోట్ల 85 లక్షల 36వేలను భూ సేకరణ రహదారి విస్తరణ నిమిత్తం 5-10-2023లో



జీవో 789 ప్రకారమే వీటీడీఏకు నిధులను కేటాయిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ జీవోను జారీ చేశారు. మూలవాగులో కలుస్తున్న మురుగు నీటిని మళ్లించేందుకు రూ.3.8 కోట్ల నిధులకు కూడా పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తూ జీవోని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ జీవోను విడుదల చేశారు.

# అబద్ధాలకు కేరాఫ్ రేవంత్‌రెడ్డి

- ఎన్నికల హామీలు ఒక్కటీ అమలు చేయలే
- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, నవంబర్ 18 : సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఘాటుగా విమర్శించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్‌మానేరులో ఇండ్లు, వ్యవసాయ భూములు, ఉపాధి మార్గాలను కోల్పోయిన నిర్వాసితులందరికీ నాడు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వచ్చి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని మాట ఇచ్చిన సంగతి గుర్తులేదా? అని ప్రశ్నించారు. ప్రజలకు కావాల్సింది ఇందిరమ్మ ఇండ్లు, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఇండ్లు కాదని, కోల్పోయిన ఆస్తులకు పూర్తిస్థాయి పరిహారమని చెప్పారు. నిర్వాసితులు 10,686 మంది ఉండగా, 4,696 మందికి మాత్రమే కొత్త జీవో ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించారని, తద్వారా 60 శాతం మందికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రాజరాజేశ్వర స్వామి ఆలయం సాక్షిగా ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాజన్న ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోవడంతో దాదాపు 20 వేల నేత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వస్త్ర పరిశ్రమకు అండగా నిలువాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌సర్కారు వస్త్ర పరిశ్రమను నిర్వీర్యం చేసిందని, ఫిషరీష్ హబ్ ఏర్పాటును గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సాక్షిగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల చేతుల్లో చీత్కారానికి గురికాక తప్పదని హితవుపలికారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో వస్త్ర పరిశ్రమకు ఏడాది పాటు ఉపాధి కల్పిస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీని మాత్రం అమలుచేయకుండా నేత కార్మికుల ఆత్మహత్యలకు కారకులయ్యారని మండిపడ్డారు. గత పదేండ్ల కాలంలో ఏడాదికి ₹350 కోట్ల బతుకమ్మ చీరెల ఆర్డర్లు ఇచ్చిన కేసీఆర్, కేటీఆర్ నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. సిరిసిల్లలోని ఏఎంసీ గోదాంను వస్త్ర పరిశ్రమకు కేటాయించాలని నాడు కేటీఆర్ కలెక్టర్‌కు లేఖ రాశారని, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన యారన్ డిపోను అదే గోదాంలో ఏర్పాటు చేస్తే నేతన్నలకు అందుబాటులో ఉంటుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, ఒజ్జల అగ్గిరాములు, గుండ్లపల్లి పూర్ణచందర్, మ్యాన రవి, సత్తార్, కుంబాల మల్లారెడ్డి, మాట్ల మధు, వేణుగోపాల్‌రావు, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, సబ్బని హరీశ్, కంచర్ల రవిగౌడ్, మానాల అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

# పెట్టుబడి సాయంపై ఊసెత్తని సర్కారు

- రైతు భరోసా, రుణమాఫీకి రాంరాం..?
- జమ కానీ మాఫీ సొమ్ము
- యాసంగికి సమాయత్తమవుతున్న రైతన్న
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

కోనరావుపేట, నవంబర్ 18: కాంగ్రెస్ పార్టీ గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు అలవిగాని హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోయింది. రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా కింద ప్రతియేటా రూ.15 వేలు ఇస్తామని చెప్పడంతోపాటు ఏకకాలంలోనే రుణమాఫీ చేసి తీరుతామని చెప్పింది. అధికారంలోకి వచ్చి 11 నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదు. దీంతో చేసేదేమి లేక రైతన్న తన పనులను తాను కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం వానకాలం సీజన్ ముగిసి, యాసంగి సాగుకు సమాయత్తమయ్యారు. అయిన కూడా ప్రభుత్వం హామీలపై రైతుకు స్పష్టతనివ్వకపోవడంతో కాంగ్రెస్ సర్కారుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత కేసీఆర్ ప్రభుత్వం రైతుకు చేదోడు, వాదోడుగా నిలుస్తూ అప్పులపాలు కాకుండా రైతు బంధు పథకాన్ని అమలు చేశారు. దీంతో 2018 వానకాలం నుంచి 2023 యాసంగి వరకు వరుసగా 12సార్లు పెట్టుబడి సాయం అందించింది. సీజన్ ఆరంభానికి ముందే రైతు బంధు ఇవ్వడంతో సకాలంలో రైతులు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుని పంటలు సాగుచేశారు. 2018 వానకాలం పథకాన్ని ప్రారంభించి 2018 వరకు ఎకరాకు రూ.4వేల చొప్పున, ఏడాదికి రూ.8వేల పెట్టుబడి సాయం అందించింది. అయితే 2019 వానకాలం సీజన్ నుంచి ఎకరాకు రూ.5వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలు అందించారు. 2023 యాసంగి వరకు గత ప్రభుత్వం రైతు బంధు రూపంలో రైతులకు అందజేసింది.



కోనరావుపేటలో వరి పంట వేసేందుకు పొలం మడిని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

## రైతు భరోసాపై స్పష్టత కరువు...

ప్రభుత్వం ఏర్పడే సమయానికి రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. పెట్టుబడికి రైతు భరోసా వస్తుందని ఆశతో ఎదురుచూశారు. కేంద్ర ప్రభుత్వం రూ.2వేల పీఎం కిసాన్ పథకం కింద విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదు. గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి రాగానే రైతు భరోసా ఎకరాకు రూ.7500 చొప్పున, ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పారు. కాగా అధికారంలోకి వచ్చి 11నెలలు కావస్తున్నా పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే వానకాలం సీజన్ గడిపోయి, యాసంగి సీజన్ రానే వచ్చింది. వ్యవసాయాధికారులు సైతం సాగు అంచనా నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. కానీ పెట్టుబడి సాయానికి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వానకాలం సీజన్‌లో ఎలాగూ ఇవ్వలేదు. కనీసం ఈ యాసంగికైనా పెట్టుబడి సాయం అందిస్తుందా? అంటూ రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## రుణమాఫీ ఎప్పుడో...?

జిల్లాలోని రైతులకు రుణమాఫీ గందరగోళంగా మారింది. ఏ ప్రాతిపదికన రుణమాఫీ ఇచ్చారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు లేకుండా ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పింది. కానీ లేనిపోని సాకులు చూపుతూ జిల్లాలో అనేక మంది రైతులకు రుణమాఫీ చేయలేదు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు 2212, తెల్లరేషన్ కార్డు లేని వారికి అధికారులు ఫోన్ యాప్‌లలో 994 మందికి కుటుంబ నిర్ధారణ చేశారు. బ్యాంకుల పరిధిలో సరిగా లేనివారు 1,218 మంది రైతులకు ఇప్పటికీ వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేయలేదు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు సైతం మాఫీ చేసిన మరికొంత మందికి మాఫీ చేయలేదు. అంతేకాకుండా రైతులు రెండు లక్షలకు ఎక్కువగా ఉన్న మొత్తంను కూడా బ్యాంకులకు చెల్లించారు. ప్రభుత్వం ఎప్పుడు చేస్తుందని ఆశతో ఎదురుచూడడంతో పాటు రుణమాఫీ కానీ రైతులు ఇటు బ్యాంకర్లు, అటు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయారు.

### కేసీఆర్ ప్రభుత్వంలోనే రైతు బంధు వచ్చింది



నాకు మా గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. కేసీఆర్ ప్రభుత్వంలో తప్పకుండా రైతు బంధు పైసలు బ్యాంకులో పడ్డయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినప్పటి సంది ఇప్పటిదాక ఒక్కసారి కూడ రైతు బంధు పైసలు పడలె. ఎన్నికల ముందు ఎకరాన రూ.7500 ఇస్తామన్నరు. చెప్పుడు తప్ప చేసిందిలేదు. ఇప్పటివర కు మూడుసార్లు రైతు బంధు పడలె. దీంతో లాగోడికి పైసలు ఎక్కువ కావడంతోపాటు ఎరువులకు, విత్తనాల కు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం మాలాంటి చిన్న సన్నకారోల్లకు రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలె.

**-గంగుల రేణుక, మహిళ రైతు, ధర్మారం(కోనరావుపేట)**

### రుణమాఫీ మాఫీ ఊసే లేదు...



నాకు 4 ఎకరాలు, మా భార్య ఎల్లవ్వ పేరు మీద 2 ఎకరాల భూమి ఉన్నది. నేను కోనరావుపేట కేడీసీసీ బ్యాంక్‌లో రూ.1.35 లక్షల లోన్ తీసుకుని ప్రతి సంవత్సరం రెగ్యులర్‌గా రెన్యూవల్ చేశాను. అలాగే మా భార్య పేరు మీద కోనరావుపేట ఆంధ్రా బ్యాంక్‌లో రూ.1.26 లక్షల లోన్ ఉంది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పి మోసం చేసింది. కొర్రీలు పెడుతూ ఇప్పటివరకు చాలా మంది రుణమాఫీ చేయలేదు. రూ.2లక్షల వరకు మాత్రమే చేస్తామంటే కూడా 2లక్షల పైన ఉన్న లోన్ అమౌంట్ కూడా బ్యాంక్‌కు చెల్లించాం. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు రుణమాఫీ ఊసెత్తడం లేదు. అసలు మిగిలిన రైతుల రుణమాఫీ చేస్తదా, చెయ్యదా అర్థంకావడం లేదు. అధికారులను అడిగితే మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేవని చెపుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం చొరవ చూపి రుణమాఫీ చెయ్యాలి.

**- మ్యాదరి నారాయణ, రైతు, నిమ్మపల్లి(కోనరావుపేట)**